# నమస్తే తెలంగాణ

# పెద్దపల్లి

5 | కరీంనగర్, ఆదివారం 25 ఆగస్టు 2024 | PEDDAPALLI


## మురుగు.. ముప్పు

కరీంనగర్ ముకరంపుర, ఆగస్టు 23: కరీంనగర్ 19వ డివిజన్ విజయపురి కాలనీలో మురుగు వెంటే ముప్పు పొంచి ఉన్నది. కల్వర్టు నిండా చెత్తా చెదారం పేరుకుపోవడంతో ఎగువ ప్రాంతం నుంచి వచ్చే డ్రైనేజీ నీరు దారిపై మోకాలు లోతు నిలుస్తున్నది. మూడు నెలల నుంచి ఇలానే ఉంటుండగా రాకపోకలకు ఇబ్బంది అవుతున్నది. మరోవైపు ఎస్ఎస్–112 ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ నీరు నిలువడం, తీగలు మురుగు నీటిలో మునిగిపోవడం ప్రమాదకరంగా మారింది. ఏదైనా ప్రమాదం జరుగక ముందే అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్డుపై రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.



మురుగునీటిలో ట్రాన్స్‌ఫార్మర్ తీగలు



సెస్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఆసాముల సంఘం నాయకులు

## విద్యుత్ సబ్సిడీ అమలు చేయండి

- ఆసాముల సంఘం నాయకుల డిమాండ్
- సెస్ ఆఫీస్ ఎదుట ధర్నా

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 24 : సాంచాలకు విద్యుత్ సబ్సిడీని అమలు చేయాలని ఆసాముల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సిరిసిల్ల సెస్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్ మాట్లాడుతూ, విద్యుత్ బిల్లులకు సబ్సిడీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. బకాయి బిల్లులు సబ్సిడీతో చెల్లిస్తామని కోరగా సెస్ అధికారులు స్పందించడం లేదన్నారు. గతంలో తాము రిలే నిరాహార దీక్షలు చేసిన సందర్భంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తమ సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ, సెస్ అధికారులు మాత్రం తమకు ఎటువంటి ఆదేశాలు అందలేదని చెబుతున్నారన్నారు. సెస్ ఎండీని కలిసి సమస్య తెలపగా ఎటువంటి ఆదేశాలు లేనందున పాత పద్ధతిలోనే బిల్లులు కొడుతున్నట్టు చెప్పారని పేర్కొన్నారు. తమ సమస్యను పరిష్కరించకుంటే నిరసన బాట పడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆసాముల సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఫీల్డ్ విజిట్ FIELD VISIT

రైతు సంఘం ఆధ్వర్యంలో సంఘటితమైన మల్లాపూర్ మండలం రాఘవపేట రైతులు

# రాఘవపేటలో 18శాతమే మాఫీ

**రుణమాఫీ ప్రక్రియ ఒడువని ముచ్చటలా సాగుతున్నది. సాగదీతతో రైతులు మాఫీ కోసం కండ్లల్లో వత్తులు వేసుకొని చూడాల్సి వస్తున్నది. మల్లాపూర్ మండలం రాఘవపేటలో 700 మందికి కేవలం 18 శాతం (126) మందికే మాఫీ కాగా, మిగతా రైతులు ఆందోళన చెందుతున్నారు. రుణమాఫీ చేస్తాంటూ ఊరించి ఉసూరుమనిపించడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల వద్దకు వెళ్తే సరైన సమాధానం రాక మూడు రోజులుగా గ్రామంలో ఇల్లిల్లూ తిరుగుతూ రుణమాఫీ పొందని 450 మంది పేర్లతో జాబితాను రూపొందించారు. మిగిలిన వారి పేర్లను సేకరించి, మాఫీ అయ్యే వరకు ఉద్యమిస్తామని స్పష్టం చేస్తున్నారు.**

- 700 మంది రైతుల్లో 126 మందికే వర్తింపు
- సర్కారు తీరుతో కర్షకుల్లో తీవ్ర నిరాశ
- అధికారుల నుంచి సరైన సమాధానం లేక ఆందోళన
- ఇల్లిల్లూ తిరుగుతూ 450 మంది బాధితుల పేర్లతో
- జాబితా సిద్ధం చేసిన రైతు సంఘం
- ప్రభుత్వంతో కొట్లాటకు సిద్ధమంటూ స్పష్టం

జగిత్యాల, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ)/మల్లాపూర్: వ్యవసాయంపై ఆధారపడిన గ్రామం రాఘవపేట. ఎటు చూసినా పచ్చని పైర్లతో చిన్న, సన్నకారు రైతుల సేద్యంతో అందంగా కనిపించే ఊరు ఇది. ఈ గ్రామంలో దాదాపు 800 మంది రైతులు సేద్యం చేస్తుండగా, అందులో 700 మంది వ్యవసాయం కోసం రుణాలు పొందారు. రాఘవపేట సమీపంలో ఉన్న ముత్యంపేటలో ఇండియన్ బ్యాంక్ శాఖ ఉన్నది. అలాగే గ్రామంలో కేడీసీసీ బ్యాంకు మెట్‌పల్లికి చెందిన బ్రాంచ్‌కు చెందిన సబ్ శాఖ సేవలందిస్తున్నది. ఈ రెండింటిలో రైతులు ఖాతాదారులుగా ఉండి పంట రుణం పొందారు. ముత్యంపేటలో ఉన్న ఇండియన్ బ్యాంకు పరిధిలో దాదాపు 200 మంది, మరో 500 మంది వరకు కేడీసీసీ బ్యాంకు పరిధిలో రుణం పొందారు. వీరంతా రుణమాఫీ కోసం ఆశగా ఎదురు చూస్తూ వచ్చారు. జూలై 18న ప్రభుత్వం ₹లక్షలోపు రుణం ఉన్న వారికి మాఫీ చేస్తున్నట్టు ప్రకటించి జాబితా ఇవ్వగా, అందులో చాలా మంది పేర్లు రాలేదు. ఇండియన్ బ్యాంకు పరిధిలో రుణం పొందిన ఒక్క రైతుకు కూడా రుణమాఫీ జరగలేదు. ఇదేంటని బ్యాంకు అధికారులను, వ్యవసాయ శాఖ అధికారులను కలిసి అడిగితే 'సాంకేతిక లోపం వల్ల పేర్లు రాలేదు. అన్ని కలిపి రెండో జాబితాలో వస్తాయి' అని చెప్పడంతో మిన్నకుండి పోయారు. జూలై 31న ప్రకటించిన ₹లక్షన్నరలోపు రుణానికి సంబంధించిన రెండో జాబితాలోనూ పేర్లు కనిపించపోవడంతో ఆందోళన చెందారు. అధికారులను కలిసి విన్నవిస్తే మూడో జాబితాలో వస్తాయని పేర్కొన్నారు. ఆగస్టు 15న విడుదలైన ₹2లక్షలలోపు రుణానికి సంబంధించిన మూడో జాబితాలోనూ పేర్లు పెద్ద సంఖ్యలో రాకపోవడంతో తీవ్ర నిరాశ చెందారు. ప్రభుత్వం తమను మోసం చేసిందని రాఘవపేట రైతులు ఆవేదన చెందారు.

### బాధితుల పేర్ల సేకరణ

మాఫీ కాకపోవడంతో అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయిన రాఘవపేట రైతులు, సమష్టిగా ఒక నిర్ణయం తీసుకున్నారు. ఇంటింటికీ వెళ్లి, రుణం పొందిన రైతుల వివరాలు, రుణమాఫీ జరగని రైతుల వివరాలు సేకరించే పనిని ప్రారంభించారు. మూడు రోజుల వ్యవధిలో రుణమాఫీ జరుగని 450 మంది రైతుల వివరాలతో జాబితాను రూపొందించారు. మిగిలిన వారి వివరాలను సైతం సేకరించిన తర్వాత గాంధేయ మార్గంలో ప్రభుత్వంపై రైతులు నిరసన దీక్ష మొదలు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. 800 మంది రైతులు ఉన్న తమ గ్రామంలో 700 మంది రైతులు రుణాలు పొందారని, అందులో 18 శాతంతో 126 మందికి మాత్రమే రుణమాఫీ జరిగిందని, ఇంతకంటే దారుణం మరొక్కటి లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 500 మందికి పైగా రైతుల పేర్లు రుణమాఫీ జాబితాలో లేకపోవడం అత్యంత అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రుణమాఫీ పేరిట తమను ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రభుత్వంపై వారు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు.

### మోసం చేసుడు మంచిగ లేదు



ఊళ్లె నాకు మూడెకరాల పొలం ఉన్నది. నేను, నా కుటుంబం అంతా ఎవుసం చేసే బతుకుతున్నం. ఏడాది కింద ముత్యంపేట ఇండియన్ బ్యాంకుల ₹1.60లక్షలు రుణం తీసుకున్న. కానీ మాఫీ కాలేదు. నాలుగైదు రోజుల సంది అర్థమైతలేదు. సర్కార్ గిట్ల జేసుడు న్యాయం కాదు. ఎందుకు మాఫీ కాలేదు? అని అడిగితే చెప్పే నాథుడే లేడు. పైకెల్లి నీ పేరు రాలేదు. అందుకే కాలేదంటున్రు. ఏం జరిగిందో..? ఏందో తెలువదు. ఊరించి.. ఊరించి ఉసూరు మనిపించిన్రు. సర్కార్ లెక్క సరికాదు. ఇత్తె ఇత్తమని చెప్పాలే. లేకుంటే లేదని చెప్పాలె గని గిట్లాంటి పాయిదార్ల ముచ్చట్లు చెప్పి మోసం చేసుడు మంచిగ లేదు.

**- గాండ్ల నారాయణ, రాఘవపేట**

### కేసీఆర్ సార్ ఇచ్చిండు



నాకు ఐదెకరాల భూమి ఉంది. రెండెకరాలు మక్క ఏస్త. మూడెకరాలు పొలం జేత్త. ఇది తప్ప నాకు ఇంకోపని తెలియదు. ముత్యంపేట ఇండియన్ బ్యాంకులో 2018లో ₹1.80 లక్షలు లోన్ తీసుకున్న. ప్రతి ఏడాది రెన్యువల్ చేసుకుంటూ వస్తున్న. మిత్తి ఎప్పటికప్పుడు కడుతూనే ఉన్న. నాకు అన్ని అర్హతలు ఉన్నయి. అయినా నాకు రుణమాఫీ కాలేదు. కేసీఆర్ సార్ ఇచ్చినప్పుడు నయం సార్. ఆయన లక్ష లోపు లోన్ ఉన్నవారికి మాఫీ చేస్తామన్నడు. అన్నట్లే చేసిండు. ఇప్పుడీ కాంగ్రెస్ ₹2లక్షలు చేస్తమన్నది. తీరా చూస్తే మస్తు మంది రైతుల పేర్లు జాబితాలో లేకుండాపోయినయి. ఇదేం కథనో అర్థమైతలేదు. ఇస్తే ఇస్తం అనాలే లేకుంటే లేదని చెప్పాలే. గిట్ల మోసం చేయడం మంచిగలేదు.

**- గంగాధరి శంకర్, రాఘవపేట**

### ఆధార్‌కార్డు సరిగ్గా లేదట



నాకు ఊళ్లె రెండెకరాల పొలం ఉంది. ఈ పొలంపైనే ఆధారపడి నేను నా భార్యా పిల్లలు బతుకుతున్నం. ఎవుసం కోసం కేడీసీసీబీ బ్యాంకు రాఘవపట్నం బ్రాంచ్‌ల ₹లక్ష లోన్ తీసుకున్న. మిత్తి ఎప్పటికప్పుడు కట్టుకుంటనే వస్తున్న. అయినా నాకు రుణమాఫీ కాలే. ఫస్ట్ లిస్టులనే కావాలే కానీ, నా పేరు రాలే. సార్లను అడిగితే రెండో లిస్టుల వస్తదన్నరు. రెండో లిస్టుల రాలేదు. మూడో లిస్టుల రాలేదు. ఏంది కథ అంటే ఆధార్ కార్డుకు పాస్‌పుస్తకానికో, ఇంకదేనికో కర్టెక్ట్ సరిపోతలేదు. అందుకే రుణ మాఫీ కాలేదని బ్యాంకు అధికారులు చెప్పిన్రు. ₹లక్షకే గింత కథ ఉన్నది. మునుపు కేసీఆర్ హయాంలో నాకు లక్ష రూపాయల వరకు మాఫీ అయ్యింది. ఇప్పుడు గిట్ల జేసుడు మంచిగా లేదు.

**- బెజ్జారపు ముత్యాలు, రాఘవపేట**

### జాయింట్ ఖాతా మాఫీ కాదంటున్రు



నా భర్త వెంకటరెడ్డికి పేరు పొంట ఆరెకరాల భూమి ఉంది. బతుకుదెరువు కోసం దుబాయ్‌కి వెళ్లిండు. ఇద్దరు పిల్లలు. బిడ్డకు పెండ్లి చేసినం. కొడుకు ఏడో తరగతి చదువుతుండు. నేను ఇక్కడ ఎవుసం చేస్త. మా ఆయన పేరుమీద ముత్యంపేట ఇండియన్ బ్యాంక్‌ల ₹1.56 లక్షలు పంట లోన్ తీసుకున్నం. అయితే దుబాయ్‌కి పోయినంక మిత్తి కట్టుడు కష్టమైతదని ఇద్దరిపేరిట జాయింట్ ఖాతా తీయించిండు. నేనే బ్యాంకుల మిత్తి కడుతున్న. సీఎం సార్ రుణ మాఫీ అయితదని చెప్పిండు కదా అని అనుకున్న. బ్యాంకుకు పోయి అడిగితే లిస్టుల మా పేరు లేదన్నరు. సార్లను అడిగితే 'మీకు జాయింట్ ఖాతా ఉంది కదా, అందుకే రాదు' అంటున్నరు. ఇదేం లెక్క సార్. జాయింట్ ఖాతా ఉంటే రుణమాఫీ కాదా..? ఏం అర్థమైతలేదు. ఎవరిని అడిగినా లాభం లేదు. అడిగీ అడిగి యాష్టకు వస్తున్నది. గిట్ల చేసుడు కరెక్ట్ కాదు సార్. మా ఆయన దుబాయ్‌ల ఉండె. నేను ఒక్కదాన్ని ఎట్ల తిరుగాలే సార్.

**- మెకార్తి గంగమణి, రాఘవపేట**

### ఇద్దరికీ మాఫీ కాలే



నా పేరు మీద 5.20 ఎకరాలు, నా భార్య లక్ష్మికి 1.20 ఎకరాల భూమి ఉన్నది. ఇద్దరం రైతులమే. వేర్వేరుగా పట్టాదారులు బుక్కులు ఉన్నయి. భూమి గూడా వేర్వేరు చోటనే ఉంది. నేను ముత్యంపేట ఇండియన్ బ్యాంకుల 2018లో ₹1.50 లక్షల పంట లోన్ తీసుకున్న. అప్పటి సంది ఏటా వడ్డీ చెల్లించి లోన్‌ను రెన్యువల్ చేసుకుంటూ వస్తున్న. నాకు రెండో దఫానే మాఫీ కావాలే. కాలేదు. మూడో జాబితాలోను నాపేరు రాలేదు. ఎందుకు రాలేదో తెలియదు. ఇక నా భార్య లక్ష్మికి సైతం ఇండియన్ బ్యాంకు పరిధిలోనే ₹40వేలు లోన్ తీసుకున్నది. ప్రతి సారి మిత్తి కట్టి రెన్యువల్ చేస్తున్నది. ఆమె లోన్ సైతం మాఫీ కాలేదు. ప్రభుత్వం రెండు లక్షల లోపు రుణమాఫీ అంటున్నారు. మా ఇద్దరి రుణం కలిపి గూడా రెండు లక్షలు లేదు. మాలో ఒక్కరికి కూడా రుణ మాఫీ కాలే. సర్కార్ చెప్పే ముచ్చట్లు అన్ని బోగస్ లెక్కనే ఉన్నయి. నూటికి ఇరవై శాతం మంది లోన్లు మాఫీ కాలేదు.

**- దేశెట్టి నగేశ్, రాఘవపేట**

### ₹40వేలు కూడా మాఫీ కాలే



సార్ నాకు నలుగురు ఆడపిల్లలు, భార్య చనిపోయింది. నాకు ఉన్నదే ముత్తెమంత జాగ ఎకరంన్నర భూమి. అండ్ల నేను తీసుకున్నది గుడా తక్కువే. నాకు గూడా రాలేదు. ఉన్న కొద్దిపాటి భూమిని చేసుకుంటనే బతుకుతున్న. నలుగురు పిల్లలను సాదుతున్న. ముత్యంపేట ఇండియన్ బ్యాంకులో 2018లో ₹40వేలు లోన్ తీసుకున్న. అప్పటి సంది ఏటా లోన్ కట్టి, మళ్లా ఎత్తుకుంటున్న. లోన్‌మాఫీ చేస్తమంటే అంటే నిజమే అని నమ్మిన. పోయిన నెలలో ₹లక్ష లోపు ఉన్నవాళ్లకు మాఫీ చేస్తమన్నరు. అప్పుడు ఆశపడ్డ. నాపేరు రాలేదు. బ్యాంకు సార్లను కలిసిన. పేరు తప్పిపోయింది. మళ్లా రెండోసారి లిస్టుల వస్తదన్నరు. అప్పుడు రాలేదు. మూడో లిస్టుల కూడా రాలేదు. ఇప్పుడు అడిగితే ఏమో మాకేం తెలుసు అంటున్రు.

**- పడిగెల చిన్నరాజం, రాఘవపేట**

## వీల్ చైర్‌లోనే వృద్ధురాలికి సెలైన్



మెట్‌పల్లి, ఆగస్టు 24 : మెట్‌పల్లి ప్రభుత్వ దవాఖానలో ఓ వృద్ధురాలికి వీల్‌చైర్‌లోనే సెలైన్ ఎక్కించారు. పట్టణానికి చెందిన ఎల్లవ్వ అనే వృద్ధురాలు జ్వరంతో బాధపడుతూ శనివారం దవాఖానకు వచ్చింది. బెడ్లు లేకపోవడంతో ఆమెకు వీల్‌చైర్‌లోనే సెలైన్ పెట్టగా, ఆమె కుటుంబసభ్యురాలు సెలైన్ పట్టుకోవడం కనిపించింది. జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రోగుల సంఖ్య పెరుగుతుండడంతో మరిన్ని బెడ్లను ఏర్పాటు చేసి రోగులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

## స్కూల్ టైంకు బస్సు నడపాలంటూ..

వెంకట్రావుపేటలో రోడ్డెక్కిన విద్యార్థులు



వెంకట్రావుపేట రోడ్డుపై బస్సును ఆపి బైఠాయించిన విద్యార్థులు

మేడిపల్లి, ఆగస్టు 24: వెంకట్రావుపేటలో విద్యార్థులు రోడ్డెక్కారు. శనివారం ఉదయం జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద బస్సును ఆపి రోడ్‌పై బైఠాయించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ జగిత్యాల నుంచి భీమారం మండలం ఒడ్యాడుకు రోజూ సాయంత్రం వెళ్లే బస్సును పాఠశాల సమయానికి అనుకూలంగా నడపాలని డిమాండ్ చేశారు. స్కూల్లో వివిధ గ్రామాల నుంచి వచ్చి అభ్యసిస్తున్నామని, అయితే పాఠశాల ముగిసిన తర్వాత గంట ఆలస్యంగా బస్సు వస్తుండడంతో ఇంటికి చేరుకునే సరికి ఆలస్యమైపోతున్నదని వాపోయారు. 'బస్సు సమయం మార్చండి. బాలికల ఇబ్బందులు అర్థం చేసుకోండి. సహకరించండి' అని నినాదాలు చేశారు. ఈ విషయమై ఆర్టీసీ అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొద్దిసేపటి తర్వాత ధర్నా విరమించి స్కూల్‌కు వెళ్లిపోయారు.

## నకిలీ ఆర్ఎంపీ, పీఎంపీల ఆటకట్టు

కరీంనగర్ విద్యానగర్, ఆగస్టు 24: అడ్డదారుల్లో వైద్య వృత్తిలోకి ప్రవేశించిన నకిలీ ఆర్ఎంపీ, పీఎంపీలపై మెడికల్ కౌన్సిల్ బృందం చర్యలకు ఉపక్రమించింది. తెలంగాణ వైద్య మండలి చైర్మన్ మహేశ్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ లాలయ్య ఆదేశాల మేరకు సభ్యుడు రాజకుమార్ ఆధ్వర్యంలోని వైద్య బృందం శనివారం గంగాధర మండలంతో పాటు కొత్తపల్లిలో పట్టణంలో క్లీనిక్‌లపై దాడులు చేసింది. తనిఖీల్లో ఆర్ఎంపీ, పీఎంపీల విద్యార్హతలు తెలుసుకొని కంగుతిన్నది. పదో తరగతి, చదువు మధ్యలో మానేసిన వారు, ఎలాంటి విద్యార్హతలేని వారు అడ్డదారుల్లో వైద్య వృత్తిలోకి వచ్చినట్టు గుర్తించింది. ఈ మేరకు గంగాధరలోని రాము సహస్ర క్లీనిక్, మల్లేశం మహేశ్వర మెడికల్స్, కట్ల మల్లేశం శ్రీరామ క్లీనిక్, అంజిబాబు క్లీనిక్, కురిక్యాలలో యాదగిరి సంపత్ క్లీనిక్ పేరుతో అర్హత లేకుండా అల్లోపతి వైద్యం చేస్తున్నట్టు గుర్తించింది. కొత్తపల్లిలో రాజమౌళి క్లినిక్, రఘు అనే వ్యక్తి మధు క్లినిక్ పేరుతో వైద్యం చేస్తుండడంతో ఆగ్రహం వ్యక్తం చేసింది. క్లినిక్‌లను సీజ్ చేసింది. సదరు వైద్యులు రోగుకు ఆంటిబయాటిక్స్, స్టెరాయిడ్స్ ఇస్తునట్టు గుర్తించి తగు ఆధారాలు సేకరించింది. మెడిసిన్‌ను స్వాధీనం చేసకున్నది. వీరిపై నేషనల్ మెడికల్ కౌన్సిల్ చట్టం 34,54 ప్రకారం వీరిపై కేసులు నమోదు చేయనున్నట్టు తెలిపింది. తనిఖీలలో కరీంనగర్ ఆంటీ క్వాకరీ బృందం సభ్యులు, హెచ్ఆర్‌డీఏ సెక్రటరీలు శరణ్ సాయి, గౌతమ్ ఉన్నారు. కాగా, తనిఖీల సమాచారంతో మరికొందరు అలెర్ట్ అయ్యారు. తమ క్లీనిక్స్, ల్యాబ్స్, మెడికల్ షాప్స్‌ని మూసేశారు.



కొన్ని కుటుంబాలు మాత్రమే ఉండడంతో బోసిపోయిన పెద్దంపేట వీధి

# పెద్దంపేట నిర్వాసితులకు పరిహారమేది?

**సింగరేణి అభివృద్ధి కోసం సర్వం ధారబోసిన వారి బతుకుల్లో అంధకారం అలుముకున్నది. ఆర్జీ–2 పరిధిలోని ఓసీపీ–3 ప్రాజెక్టు విస్తరణ కోసం విలువైన భూములు, ఇండ్ల స్థలాలను ధారదత్తం చేసిన పెద్దంపేట నిర్వాసితులకు ఆనాడు అధికారులు చేసిన నిర్లక్ష్యం.. పట్టింపులేమి శాపంగా మారింది. ఫలితంగా 52 కుటుంబాలకు పరిహారం, ప్యాకేజీ రాకుండాపోయింది. పరిహారం ఇవ్వాలని కొన్ని నెలల క్రితం కోర్టు ఆదేశించినా 'నిర్వాసితులు ఇక్కడ నివాసం ఉండడం లేదని, ఎలా ఇస్తామన్న..? అధికారుల మాటలతో కన్నీరే మిగులగా, మరోవైపు ఓపెన్‌కాస్ట్‌లో బ్లాస్టింగ్‌లతో దిన దినం గండంలా బతకాల్సిన దుస్థితి దాపురించింది.**

- సింగరేణి నిర్లక్ష్యంతో 17 ఏండ్లుగా బాధితుల నరకయాతన
- 2007లో ఓసీపీ-3 ప్రాజెక్టు కోసం ఊరుకు ఊరే సేకరణ
- 52 కుటుంబాలకు ఆగిన పరిహారం.. ఇప్పటికీ చెల్లించని దైన్యం
- కోర్టు ఇవ్వాలని ఆదేశించినా అలసత్వమే
- బ్లాస్టింగ్‌లతో వణికిపోతున్న బాధితులు
- ఇండ్లలో ఉండలేక, వేరోచోటుకు వెళ్లలేక అవస్థలు

పెద్దపల్లి, ఆగస్టు 11(నమస్తే తెలంగాణ): సింగరేణి ఆర్జీ–2 పరిధిలోని ఓసీపీ–3 విస్తరణ కోసం 2007లో రామగిరి మండలం పెద్దంపేటలోకి సింగరేణి ప్రవేశించింది. ఊళ్లోని విలువైన ఇండ్లు, భూములను తీసుకున్నది. ఈ క్రమంలో అప్పటి ప్రభుత్వం 2,135 నిర్వాసిత కుటుంబాలకు జీఓ 68 ప్రకారం పరిహారం చెల్లింపుల కోసం 2007 నుంచి 2010వరకు అవార్డులు పాస్ చేసింది. 2010లో ఒక్కో కుటుంబానికి సింగరేణి ద్వారా ₹3.25లక్షల పరిహారం ఇవ్వగా 2017లో పునరావాసం కింద ₹4లక్షలను అందజేసింది. అలాగే గ్రామానికి చెందిన రైతులకు జల్లారం చెరువు కింద ఉన్న వ్యవసాయ భూములు 1200 ఎకరాలకు సేకరించి, ఒక్కో ఎకరానికి ₹2.50లక్షల అందించింది. ఆ టైంలో సింగరేణి, రెవెన్యూ అధికారులు చేసిన నిర్లక్ష్యం 52 కుటుంబాలకు శాపంగా మారింది. పరిహారం అందకుండా పోయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు అనేక పోరాటాలకు దిగుతున్నా ప్రభుత్వం కానీ, సింగరేణి సంస్థ కానీ పట్టించుకోవడం లేదు. మరోవైపు ఓసీపీలో నిత్యం బ్లాస్టింగ్‌లతో భయంకర పరిస్థితుల్లో జీవిస్తున్నారు. బాధితుల్లో కొందరు ఊరిని విడిచివెళ్లిపోగా, 20 నుంచి 30 కుటుంబాలైతే ఇండ్లు కూలుతున్నా గ్రామంలోనే నివసిస్తున్నాయి.



కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించేందుకు వచ్చిన పెద్దంపేట వాసులు

### కోర్టు చెల్లించాలని ఆదేశించినా నిర్లక్ష్యం

పెద్దంపేట గ్రామం పూర్తిగా నిర్వాసిత గ్రామమైనా సింగరేణి సంస్థ పరిహారం చెల్లించడం లేదని 2020లో 52 కుటుంబాలు హైకోర్టును ఆశ్రయించాయి. ఈ క్రమంలో సదరు కుటుంబాల పరిస్థితిని పరిశీలించి ఎకరం 12గుంటల భూమిలో విస్తరించి ఉన్న వారి ఇండ్లకు పరిహారం చెల్లించాలని ఇటీవల కోర్టు ఆదేశించింది. ఆ ఆదేశాలతో సింగరేణి సంస్థ రెవెన్యూ అధికారులను ఆశ్రయించి 17 ఏళ్ల తర్వాత గత జనవరి 2న నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఇక్కడే అసలు సమస్య వచ్చింది. బ్లాస్టింగులతో ఇల్లు విడిచి వెళ్లినవారు సర్వే సమయానికి గ్రామానికి వచ్చి, ఇండ్లను బాగు చేసుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటుండగా, సింగరేణి అధికారులు వచ్చి అడ్డుకున్నారు. ఎక్కడా ఎలాంటి రిపేర్లు చేయవద్దని, గ్రామం ఎలా ఉందో అలాగే ఉండాలని తేల్చిచెప్పారు. ఇంతలోనే రెవెన్యూ, సింగరేణి ఎస్టేట్ అధికారులు గ్రామంలో ఇండ్లను తీసుకునేందుకు సోషల్ ఎకనామికల్ (సామాజిక ఆర్థిక సర్వే)ను చేపట్టారు. అయితే ఇండ్లకు ప్రాజెక్టు నంబర్లతోపాటు ఓటర్ ఐడీ కార్డులు, ఆధార్, రేషన్ కార్డుల ఆధారంగా బాధితులను గుర్తించకుండా, ఇండ్లల్లో నివాసం ఉన్నారా..? లేదా..? అని చూశారని, బ్లాస్టింగులతో గ్రామంలో భయానక పరిస్థితులు ఉంటే ఇండ్లలో ఎలా ఉంటామని నిర్వాసితులు ప్రశ్నిస్తున్నారు. బాధితులు ఇండ్లల్లో ఉండడం లేదని ఎలిగేషన్ పెట్టి పరిహారం ఎగ్గొట్టేందుకే సర్వేను ఇష్టారాజ్యంగా చేశారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం, సింగరేణి సంస్థ తమ సమస్యను సానుభూతితో పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై మంథని ఆర్డీఓ, సింగరేణి భూ సేకరణ అధికారి హనుమనాయక్‌ను వివరణ కోరగా, ఎస్ఈఎస్ సర్వే పూర్తయ్యిందని త్వరలోనే గెజిట్ పబ్లికేషన్ జరుగుతుందన్నారు.

### మరీ ఇంత అన్యాయమా..?



సింగరేణి సంస్థ భూసేకరణ చేసినప్పుడే అందరికీ చెల్లింపులు చేయాల్సి ఉండె. కానీ కొందరికి ఇవ్వకపోవడం వల్లే ఇబ్బందులు తలెత్తాయి. అనేక పోరాటాల తర్వాత ఇటీవల పరిహారం ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. కానీ సామాజిక ఆర్థిక సర్వే పేరుతో పరిహారాన్ని ఎగ్గొట్టే ప్లాన్ వేస్తున్నరు. రెవెన్యూ అధికారులను సింగరేణి అధికారులు మేనేజ్ చేస్తూ నిర్వాసితులకు అన్యాయం చేయాలని చూస్తున్నట్లు తెలుస్తుంది. మరీ ఇంత అన్యాయం ఉంటదా..? సానుభూతితో సమస్యను పరిష్కరించాలి. నిర్వాసితులకు 2013కొత్త చట్టం ప్రకారం పరిహారాన్ని చెల్లించాలి.

**- చింతపట్ల నాగరాజు, మాజీ సర్పంచ్ (పెద్దంపేట)**

### మాకు న్యాయం చేయాలి



జనవరి 2న నోటిఫికేషన్ ఇచ్చారు. ఆ తర్వాత మార్పులు చేర్పులకు 60రోజుల సమయం ఇవ్వాలి. కానీ, ఇవ్వలేదు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నోటిఫికేషన్‌కు పీడీకి మధ్య ఆరు నెలల సమయం ఉంటుంది. ఆ టైంలో వచ్చిన దరకాస్తును పరిశీలించి వాటిని నమోదు చేసి పబ్లిక్ నోటిఫికేషన్ చేయాలి. కానీ ఎలా ఉన్న లిస్టును అలాగే పబ్లిక్ నోటిఫికేషన్ ఇచ్చారు. దీని వల్ల దరఖాస్తు చేసుకున్న వారికి అన్యాయం జరుగుతున్నది.

**- బాకం రాజేశం, మాజీ ఎంపీటీసీ (రామగిరి మండలం)**